# సంక్రాంతి పురుషుడు ★

రచయిత :
... టి. జె. మోహన్‌రావు ...

“మావల్ల మీకేం అపకారం జరిగిందని ఆయనను మా మిల్లులో ప్రవేశపెట్టారు? మీకేమన్నా కావలసుంటే తృణమో పణమో రహస్యంగా దఖలుపరచుకుంటాను. మీకు పుణ్యముంటుంది. ఆయనను మానిపించే యేర్పాటు చూడండి. అబ్బన్నకు నౌకరీయే వుండాలని మీ కోరికయితే, మా అగ్రహారం కరణంగారు తనకో గుమాస్తా కావాలని అంటున్నాడు. అబ్బన్నగారికి యేదో కొంత ముట్టచెప్పిస్తూ ఆయనకు సహకరించేందుకు పంపండి. ఆ కర్ణంగారు పన్ను తగ్గింపు చట్టం తన ప్రజ్ఞవల్ల అమలుజరిపించి పొలాలకు పన్ను లేకుండా చేస్తానని యకరానికి ఐదు రూపాయలకు తక్కువ కాకుండా ప్రతి రైతు దగ్గరా వసూలుచేస్తున్నాడు కదా! ఆయనదగ్గర అబ్బన్నగారు ప్రవేశించాడంటే ప్రజలు సుఖిస్తారు. అంతేకాని మామీదెందుకు చెప్పండి మహానుభావా మీ ఆగ్రహం?” అంటూ వస్తూనే వెంకటపతిరావు మీద విరుచుకుపడ్డాడు.

“నామీద పడకపోతే అక్కర్లేదని వాణ్ణి తోలేయలేకపోయావా?” అన్నాడు రావు చిరునవ్వుతో.

“నేనయితే ఆపని చేసేవాణ్ణే. కాని మీరేం చెప్పారో, అబ్బన్నగారిలో ఏప్రత్యేకత చూసాడో, ఆయనమీద ఈగన్నా వాలకుండా చూస్తున్నాడు మా నాన్న. యేం ముంచుకు వస్తుందో తెలియకుండా వుంది” అన్నాడు వెంకటపతి వగర్చుకుంటూ.

“ఇంతకూ ఆయనలోవున్న దోషమేమిటి అంత ఖంగారుపడుతున్నారు?” అన్నాడు ప్రసాద్ ఆశ్చర్యంగా.

“ఒరేయి ప్రసాద్, అబ్బన్నలో స్వతహాగా నేరంవుందని చెప్పేందుకు కెవరితరమూ కాదురా, ఐనా వెంకటపతి భయపడ్డానికి కూడా తగినన్ని కారణాలు లేకపోలేదు. అది వెంకటపతి లోపమూ కాదు, అబ్బన్న దోషమూ కాదు. దానికి వికృతినామ సంవత్సరంలో అబ్బన్న పుట్టిన ఘడియలల్లాంటివని మనమనుకోవాలి. లేకుంటే వూరుకుని వూరుకుని, అకస్మాత్తుగా వుప్పెనలా పొంగి రెండు మూడేళ్ళకో పర్యాయము చటుక్కున యే ఆసామీదగ్గరో ఉద్యోగప్రయత్నం చేయడమూ, వెంటనే వాడి నెరుగున్నవాళ్ళంతా “యజమానికి గ్రహబలం చాలదేమో శాంతులూ, హోమాలూ చేయించుకో మనరాదూ” అంటూ, “తోకచుక్క తోక ఆ దిశగా మళ్ళింది కాబోలు!” అని ఆశ్చర్యంగా, యెంతకాలం నుంచో “తోకచుక్క ఉదయించడం, అతివృష్టి అనావృష్టి బాధలూ, తుపానుభీభత్సం- వీటికి కారణమే అయివుంటుందా?”—అని బుర్రలు బద్దలయ్యేలా తరచి తరచి ఆలోచించి, చివరకు—అబ్బన్న నౌకరీలో జేరడమే వీటన్నిటికీ హేతువయ్యుండాలి” అని నిర్ధారణచేసుకున్నట్టు వాడినేదో అనబోయేసరికి అబ్బన్న ఆలోచించడానికి ప్రయత్నించి, ఆఖరుకు కొత్తగావచ్చిన రైలింజన్లా ధ్వనించి, పట్టుదలతో ప్రతిసారీ ఎవరిదగ్గరో వకరిదగ్గర నౌకరీలో ప్రవేశించడం, మూడు నాలుగు నెలలయేసరికి తిరిగి పక్షిలా స్వేచ్ఛగా రెక్కలు జాడించుకుంటూ, నడివీధిలో అరుగు చివరకు యథాప్రకారం జేరుతూండడం, ఇన్ని సంవత్సరాలనుంచీ పరిపాటుగా ఏమార్పూ లేకుండగా జరుగుతూండడం వుండనే వుండదు. అబ్బన్న తన జన్మఘడియలదీ, తన్ను నౌకరీలో పెట్టుకున్న వాళ్ళ కర్మదీ ఆదోషమై వుంటుందని, నిక్కచ్చిగా చెపుతూరావడంవల్ల కూడా, వాడి నేరం వుండివుండకూడదని ఒక్కసారైనా వప్పుకుతీరడంలో లోపం వుండదు.

కాగా అబ్బన్న బొత్తిగా పట్టుదల లేని మనిషీ, ఆత్మగౌరవంలేని వ్యక్తీ అని యెంచడానికి వీలులేదు. గజనీమహమ్మదు ఇండియా మీద మీసం దువ్వినదానికంటే రెండు పర్యాయాలు అదనంగా “చూసుకో నాతడాఖా!” అంటూ స్కూలుఫైనలుమీద కొన్ని వందల గేలన్ల తేయాకు కషాయానికి కొన్ని టన్నుల పుస్తకాలు మాటుపెట్టి, జబ్బలు తరచి దండెత్తి — అన్నిసార్లూ కూడా ఆ పరీక్ష శరించి యెదురవడం మానకపోతే”—“విరోధమైనా విహితమైనా సమవుజ్జీలతో రాణిస్తుంది కాని నీబోటి సిగ్గువిడచిన భ్రష్టాకారి పీనుగతో నాలాంటి సిగ్గులున్నవాళ్ళకు తగనిపనం”టూ స్కూలుమీదా పరీక్షమీదా సత్యాగ్రహం ప్రకటించి తన పట్టుదలనీ ఆత్మగౌరవాన్నీ, ఉదాత్తంగా, చరిత్రాత్మకంగా రుజువుచేసుకున్నాడు.

ఇంతలో—“నాకూతురుకు నా సొమ్ము అంటే యోగంలేక చెప్పినమాట విని నాదగ్గర వుండకుండా వుంది. పక్కదాన్ని యింత మేడలోనూ బిక్కుబిక్కుమంటూ కాలక్షేపం చేయడం కష్టంగా వుంది. నీలాంటి ప్రయోజకుడు నాచెప్పుచేతల్లో నా కాసరాగావుండి, యింటిఅద్దెలూ, పొలంశిస్తులూ వసూలుచేసి పెడుతూవుంటే నా తదనంతరం యీ మేడ కాస్తా సంక్రమింపచేస్తాను. నువ్వు పరాయివాడవు కాదు కదా ఆలోచించు”—అంటూ పెత్తల్లి అబ్బన్నకాహ్వానం పంపింది. “భేష్! మహాబాగుంది. నీలాంటి వంటరివాళ్ళకు చేసే వుపకారమే వుపకారం. నా కంతకంటే ఉన్నతాసమయం మరోటి కన్పించదు”— అంటూ వక్కగంతులో పెత్తల్లి యెదుట వాలాడు. మర్నాడు ఆమె మకాం మేడపైభాగానికి మార్పించి క్రిందిభాగం అద్దెకిప్పించాడు. ఆమె పై అంతస్తు కెక్కిన ముహూర్త మెల్లాంటిదో కాని, అబ్బన్న గుండె లాగిపోయే పర్యంతం అంత శుశ్రూషా చేస్తున్నా, అకస్మాత్తుగా పదిహేనో రోజున, నల్లరాయిలాంటి అంత మనిషీ, తిరిగి పై అంతస్తు కెక్క అవుసరం, లేకుండా, నల్గురు మనుష్యులు వాహకత్వం నిర్వహించగా

క్రిందకు రప్పింపబడింది. మరుక్షణం ఆమె కూతురు ఎగురుకుంటూ చక్కావచ్చి, తగు కట్టుదిట్టాలతో అబ్బన్న నాభాయలలేకుండా చేసింది. అన్నిటికీ భగవేదిచ్ఛేమూలం అనే వేదాంతపైపుకు గిరుక్కున తిరిగి అబ్బన్న చేతులు దులుపుకుంటూ కూనిరాగంతో యింటికి చేరాడు. అదే మొదలు, మిత్ర బృందంలో అబ్బన్న పలుకుబడి పాదరసంలా క్షణ క్షణం పైకి పొంగుకుపోవడం మొదలు పెట్టింది.

ఇది యిల్లాగుండగా దేశంలో ఐకమత్యతా, "నీకూ నాకూ ఎందులోనూ భేదం లేదు" అనే భావం, వ్యాప్తిచెంది సంఘం సర్వతోముఖంగా అభివృద్ధిచెందాలంటే— తన అవుసరాల్ని యితరులు తీర్చివేయాలి. తనకు తీరికగావుంటే, వీలైనంతవరకూ, కాలం శీతోష్ణస్థితీ, వాతావరణం అనుకూలిస్తే, తమ వాళ్ళకు పనిచేయడానికి కభ్యంతరం లేదు. అంతే కాని "ఇంత యిస్తాం అంతచేయి" అంటే యింగితం కలవాడు సహించి వూరుకొనడమంతటి అత్యాచారం మరొకటి వుండబోదని ప్రతివ్యక్తీ గుర్తించితీరాలని తనలో తను తలపోస్తూ; అదను దొరకినప్పుడల్లా దృఢవిశ్వాసంతో ఆ భావాన్ని వ్యక్తీకరిస్తూ వుండి. యెంత కాలానికీ తను కోరిన లక్షణాలూ, మనోభావాలూకల యజమానెవరూ తన దృక్పథంలో అడ్డురానందువల్లనూ, పురుషుడే వుద్యోగంచేసి వూళ్లేలాలనీ మాట పాత ఉసిరికాయ పచ్చడిలా పత్యానికి తప్ప పనికి రాదనే దృఢనమ్మకంవల్లనూ, అబ్బన్న వూళ్లో అందరికీ, ముఖ్యంగా మగదక్షతలేని ఆడవారికీ, బ్రహ్మచర్యాశ్రమంలో ఎడతెరపి లేకుండా ద్వంద్వ యుద్ధంచేసే మగవారికీ (కొంచెంసేపూ వాణ్ణి పిలిచి కబుర్లుచెప్పినా, వాడి కాలాన్ని వ్యయంచేసిన వారవుతారని గుర్తించుకుని, ఆరోజుకు వాడి అవుసరాలను తాము తీర్చవలసివుంటుందనిమాత్రం మరచి పోకుండా వుంటె చాలు) కాలక్షేపానికీ కబుర్లకూ సహకరిస్తూ తన జీవితపంథాతో యే తగాయిదాలూ లేకుండా తటస్థంగా వూరుకుంటాడు.

గిరీశంగారికి భగవంతుడు తనను స్వతంత్రుడుగా సృజించాడా, అస్వతంత్రుడుగా పుట్టించాడా అనే ఆలోచన తాత్కాలికోద్రేకంలో మెరపులా మెరసి మాయమయిందేమో కాని అబ్బన్నకుమాత్రం ఆ జిజ్ఞాస వృత్తివిషయంలో వోనిర్ధారణకు రానివ్వకుండా శాశ్వతంగా వుండిపోయి, తన్ను పుట్టించిన భగవంతుడు ప్రతి అగస్త్యభ్రాతా చేతా "వూడకొట్టిన మంచంకోడులా మూలల్నాక్రమించకపోతే, అది చేయరాదా, ఈ ఉద్యోగంలో చేరరాదా?" — అంటూ తీతువపిట్టరాయబారాలు పంపిస్తూ, తన్నీ లోకంలోకి దురదగొండిలా విసిరిపారెయ్యక పోతే—తనను సృజించిన కారణమేమిటో తేగేసి కట్టేపేడు సమాధానం యిస్తే తీరి పోతుంది కదా అని తనలో తనూ — తను విశ్రాంతితీసుకుంటుంటే వాళ్ళ ప్రశ్నలూ, అరుగులూ అరగిపోతున్నట్టుబాధపడి మొండి గోడలమీది కొండముచ్చుల్లా తన్ను కాకమ్మ వూకలతో వేధించిన వాళ్లముఖతాను, ఈశ్వరుణ్ణి నిలపెట్టి, సాగతీసి పర్తుకాలరుపట్టి గుంజి మరీ అడిగి, అడిగించగా, ఈ భక్తుడి నిర్మొగమాటపుదాడికి తట్టుకునేందుకు వూపి రాడకపోగా చిన్న నవ్వునవ్వి—"అబ్బన్నా! —'సర్వేజనా స్సుఖినో భవంతు' అనే భావంతో అందరికీ అన్ని అవకాశాలూ, సదుపాయాలూ చేద్దామనీ, నల్లబజారూ, లంచగొండితనం సమూలంగా జైపథంలోకన్నా ఆగాలి దొరక్కుండా రూపు మాపు చేసేందుకు—భూప్రపంచంనుంచి ఆకాశందాకానే కాదు, క్రింద వున్నారని మీ వూళ్లో అనుకునే కుక్కమూతి వాళ్ళదగ్గర్నుంచి, శాస్త్రజ్ఞులు చెప్పే చంద్రలోకంలోని మనుష్యుల దాకా, నాటుసరుకుల్లో నాణ్యం తక్కువని, విదేశాల్నుంచి పెద్దరకం పరికరాల్ని తెప్పించి—పీతలా అడ్డునడకలుమాని, నిటారుగా, తిన్నగా వెళ్ళి వినేవాళ్ళ చెవులు యింక వినేందుకు పనికిరాకుండా గాలించి సతమతమాతున్నట్టు అన్ని వేళలా, అన్ని యంత్రాల ద్వారానూ వింటున్నా, వాటికి చిహ్నాలు మైలురాళ్ళులా, బట్టతలవాని వెంట్రుకల్లా నీకు కనపడుతున్నాయే — అల్లాంటప్పుడు వంటరివాణ్ణవడంవల్ల పనితొందరలో నావల్ల చిన్నపొరపాటు జరిగినందుకు నీవు ఖంగారు పడడం భావ్యంగా లేదు. మొదటిలో నిన్ను 'స్వతంత్రుడుగానే సృజిద్దామనుకుని, వ్యవహారాల వత్తిడిలో 'అస్వతంత్రుడు' అని పొరపాటున నీ నుదుటిమీద వ్రాసాను. కాని వెంటనే పొరపాటు గుర్తించుకొని ఆమాట కొట్టేసి 'స్వతంత్రుడు' అని వ్రాసాను దాని ప్రక్కనే. ఖంగారులో కొట్టేసినమాట పూర్తిగా చెరిగిపోనందువల్ల, రెండువర్గాల మిశ్రమమంత్రివర్గంలాగ నీమనస్సు ఓ నిర్ధారణకు రాలేకపోయి, యితర్లు వత్తిడిచేస్తేనేం, మరెందు కయితేనేం, రెండు సంవత్సరాల కోపర్యాయమన్నా, మూడు నెలలకు ఎక్కువా, రెండు వారాలకు తక్కువా కాకుండా తప్పకుండా నౌకరీ చేయవలసినస్థితి నీకు తప్పక పోవడం చూసి విచారిస్తున్నాను" అంటూ ఈశ్వరుడు కేకేసి కలలో చెప్పినట్లు, రెండు పెద్దబేస్తులమీద ఆటపడ్డవాని ముఖంలా ప్రజ్వలిస్తూ, వాసం కమ్మిలా తొణుకూ బెణుకూ లేకుండా నిశ్చలంగా వుపన్యసించాడు. వాడి వుద్యోగపర్వాల్లోని హ్రస్వజీవితాలను చూస్తుంటే ఆ విషయం యథార్థమయివుంటుందని అంగీకరించక తప్పదేమో ననిపిస్తుంటుంది.

మొదటలో పెత్తల్లి వారసత్వంనుంచి దూరుడైపోయాక చెల్లెలి వత్తిడివల్ల అబ్బన్న మేనమామ ప్లీడరు శంకరంగారు మేనల్లుణ్ణి తనదగ్గర గుమాస్తాగా వుండేందు కాహ్వానించాడు. మేనమామ తన్నాహ్వానించడాని కదే ప్రథమ పర్యాయ మవడంవల్ల వుత్సాహంగా బయలుదేరి వెళ్ళాడు అబ్బన్న. కొంతకాలం యథోచిత మర్యాదలతో సూదిలోదారంలా వెళ్ళిపోయిం దిద్దరకూను. యింతలో కొన్ని అనివార్యావసరాలవల్ల తప్పనిసరై శంకరంగారు పార్టీల తాలూకు సొమ్ము వుపయోగించుకోక తప్పిందికాదు. వారు వత్తిడిచేసారు. శంకరంగారు తగిన సమాధానం యిచ్చేస్థితిలోనూ, తిరిగి సొమ్ము చెల్లించగలిగిన వాతావరణంలోనూ కూడ లేక పోయాడు. పార్టీలు కేసుపెట్టారు. కొంత శిక్షతో ప్లీడరుగారి పట్టా రద్దవగా మేనమామ మేనల్లుళ్ళిద్దరూ కలసి వుమ్మడిగా ఉద్యోగప్రయత్నం చేయవలసిరావడంవల్ల

అబ్బన్న మేనమామను బాధతోనే వదలిపెట్ట వలసివచ్చింది.

స్నేహితులు వీడి తాలూకుగాలి కూడా తమను సోకేందుకు భయపడసాగారు. నిత్య కృత్యాలకు మిత్రుల సహకారసానుభూతులు అందుకోనడంలో కొంత క్లిష్టత తటస్థించింది.

"అబ్బాయీ! యింట్లో అది నిండుకుంది. యిది లేదు. మీనాన్నగారికి వచ్చే నెల పెన్షనూ అప్పుడే ఖర్చయి చాల రోజు లయింది. మొద్దులా కూర్చుంటే యెల్లాగురా? పెళ్ళిప్రయత్నమొకటి తప్పదు కదా? ఆపిల్ల నీకు ఈడూ జోడూ బాగుంటుంది. వెళ్ళి చూసుకురా" అంటూ తల్లి అనేక కోణాల్నుంచి అబ్బన్నమీద అగ్నిబాణాల్ని సంధించి వదలింది. అబ్బన్న స్థయిర్యంతో వాటి నెదుర్కొని "వెర్రిదానవు కాని భార్యకోసం పెద్దప్రయత్నం చేయాలిటే? యోగం కుదిరితే అన్నీ మనల్ని వెతుక్కుంటూనే చక్కా వస్తాయి" అంటూ బయటకు నడచాడు. నిజమే అబ్బన్న ఏదీ కూడా కావాలని యెప్పుడూ ప్రయత్నంచేయలేదు. వీడి దృష్టి పడేందుకు ఆయా పరిస్థితులేదో పొదమిస్తూ వచ్చా యింతవరకూను. కాని ధనాభావం ఏర్పడి నౌకరీ చూసుకోడం తప్పనిసరని తల్లి వత్తిడిచేయడంచేత సుబ్బయ్య బట్టల దుకాణంలో అబ్బన్నతండ్రి అబ్బన్నను ప్రవేశించేటట్లు చేసాడు.

సుబ్బయ్య వ్యాపారం నలుపుతెలుపుబజార్లలో ముమ్మరంగా సాగుతూ మూడు మేడల్ని కట్టాడు. అల్లాంటి సమయంలో అబ్బన్న చేరాడు. యెన్నడూ లేంది ప్రతి ఆఫీసరూ అందరు కాతాదార్లూ సుబ్బయ్య వ్యాపారాన్ని అదోవిధంగా చూడ్డం మొదలు పెట్టారు. నల్లబజారులోకి వెలుతురు రావడం ప్రారంభించింది. యేడాదిలో యెనిమిదిసార్లు దొంగవర్తకానికి జరిమానాలు చెల్లించడం ఆరు నెల్లు శిక్ష అనుభవించడం జరిగి చివరకు సుబ్బయ్య శిల్కుపాలెస్ చూస్తుండగా చిన్న ఖద్దరు దుకాణంగా మారింది. ఆ చిన్నవర్తకానికి గుమాస్తా పనిలేదని సుబ్బయ్య నను గుతూ అబ్బన్నకు చెప్పకతీరలేదు.

ఆ తర్వాత ఆలోచించి ఆలోచించి ప్రభుత్వానికి సహకరించేందుకు యుద్ధంరోజుల్లో వార్ సర్వీసులో చేరాడు. వున్నట్టుండి జపాను ఇండియామీద విరుచుకుపడడం మొదలు పెట్టింది. ఆసేతు హిమాచలపర్యంతం దేశం కలవరపడిపోయింది. అబ్బన్న విశ్రాంతి నెరుగకుండా సేవా ధర్మాన్ని నిర్వర్తించేందుకు కంకణంకట్టాడు. కాని ఆహారవిహారాలు అనుకూలంగాలేక సడలింపలేని నిబంధనలలో వుండడంచేత అకస్మాత్తుగా అబ్బన్న కారోగ్యం చెడింది. అనారోగ్య స్థితిలో ఉద్యోగధర్మాన్ని సక్రమంగా నెరవేర్చలేక పోతూవుండడంచేత ప్రభుత్వం అబ్బన్న సేవల్నందుకునేందుకు నిరాకరించింది. అంతే అక్కడితో హిందూదేశంమీద జపాను ఆట కట్టుపడింది. యుద్ధం తపీమని దిగ్విజయంగా ఆగిపోయింది.


## నిట్టూర్పు.

ప్రణయమే ప్రమాదానికి దారితీస్తుంది. విరాగిని చేస్తుంది. త్యాగానికి ఉసిగొల్పుతుంది. ఈ నవలయందు స్త్రీ వలచినను పురుషుడు మిత్రునికై స్వార్థాన్ని గణించక త్యాగంచేయటం అపూర్వ విషయం. తాననుకొన్నట్టు, తన్ను ప్రేమించినయువతి తన ఇష్టానుసారం మిత్రుని వివాహమాడి సౌఖ్యాన్ననుభవించక పోవటంచూచి చింతకు లోనై తను మరుగైపోవుట విషాదపరిణామం. ఇది పాశ్చాత్య నవలా పద్ధతి ననుసరించి రచింపబడినది. తెలుగులో ఇట్టి నవలారచన కిదే ప్రథమం. చదువుటలో మైమరపును గల్గించును.

వెల 0—8—0 అణాలు.

చిత్రగుప్త ఆఫీసు,
6, లాయర్ చిన్నతంబి
మొదలివీధి, మద్రాసు.


అబ్బన్న జీవిత చరిత్రలో ప్రతిపుటా అనేక అమూల్య రసవత్తరఘట్టాలతో సువర్ణాక్షరాలలో నింపబడివుంది. వీడిమాటల్లో, చూపుల్లో, భావంలో, చేతలో, చేతుల్లో, నడకలో ఏజీవి, ఏదేశం సేవల్నందుకునే భాగ్యం పొందుతుందో దానికి కలుగబోయే ప్రతిఫలం ఆలోచించగలిగిన శక్తి ఎక్కడా లేదు. అల్లాంటప్పుడు వెంకటపతి భయపడ్డాడూ అంటే అందులో విచిత్రపడవలసిన కార్యం లేదు. అదిగో అబ్బానే వస్తున్నాడు అన్నాడు రావు చిరునవ్వుతో. "వెంకటపతీ! మీ నాన్న నిన్ను నుంచున్నపాటున రమ్మనమంటున్నాడు" బీడీతీసి ముట్టించి గట్టిగా దమ్ములాగుతూ అన్నాడు అబ్బన్న.

"ఎందుకూ?"

"ఎందుకేమిటి? కాతాపుస్తకాల్లో లెక్కలకూ, మిల్లులోస్టాకుకూ, పెట్టెలో లెక్కకూ ఎక్కడా పోలికలు లేవని ప్రభుత్వోద్యోగులు పుస్తకాలు పట్టుకువెళ్లారు. వెళ్ళి ఆ విషయంలో తంటాలుపడి బయటపడేందుకు" చిరునవ్వుతో జవాబిచ్చాడు అబ్బన్న.

"కొంప మునిగింది బాబూ! యిదిగో ఈ యాభై రూపాయలూ పుచ్చుకుని సంతోషించి మమ్మల్నింతతో రక్షించి వదలండి. తిరిగి మీరు శ్రమపడి పనిలోకి రానవసరంలేదు" అంటూ విసవిసా బయటకు నడచాడు వెంకటపతి.

"నా అభ్యంతరం మాత్రమేముంది. ఒరే రావూ! ఈనెలలో మన గ్రహస్థితి వుచ్చగా వుందిరా. వెంకటపతి తండ్రి యాభై రూపాయలు యిచ్చి నమస్కరించాడు. వెంకటపతి తనో యాభై యిచ్చాడు. రేపు వుదయం ఢక్కా ప్రయాణం"

"ఎందుకు?"

"ఎందుకేమిటి నవాబుల సేవచేసేందుకు"

"అబ్బన్నగారూ, అక్కడింకా పరిస్థితులు చక్కపడలేదు. ముందు మనయింటిని మనం చక్కచేసుకోవాలి. అంచేత యే రాజకీయపార్టీలోనన్నా చేరి దేశాన్నుద్ధరించండి"

"అదే నేనూ ఆలోచించాను. కాని ముందు కాంగ్రెసుపార్టీలోచేరి, కమ్యూనిస్టుపార్టీలో చేరుదామా లేక కమ్యూనిస్టుపార్టీలోచేరి ఆ తర్వాత కాంగ్రెసుపార్టీలో చేరుదామా అనే నిర్ధారణకు రాలేక మరోచోటికి ప్రయాణం కట్టి అటు మొగ్గానంతే కాని మరేం లేదు"

"కాని సంక్రాంతి పురుషదృష్టి ప్రస్తుతం సోషలిస్టుపార్టీ వైపుకుమాత్రం మళ్ళించకండి"